ప్రజలకు వైద్య భరోసా

- జీవీఎంసీ 61, 89, 40 వార్డుల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ సుధ, వైద్యాధికారి



వైద్య పరీక్షల కోసం పేర్లు నమోదు చేసుకుంటున్న స్థానికులు



రోగులకు మందులను పంపిణీ చేస్తున్న బద్రీనాథ్, నాగేశ్వరావు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ఇండస్ట్రియల్ కాలనీ సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వల్ల పేదలకు భరోసా లభిస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల చెంతకే వైద్యులను పంపించి వారికి అవసరమైన మందులు,శస్త్రచికిత్సలు చేయిస్తున్నారని వివరించారు. 150 మందికి వైద్య నిపుణులు సేవలు అందించారు.కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు జీవీఎస్ఎన్ రాజు (కేబుల్ వాసు), నాయకులు భోగవల్లి నాగభూషణం,సోనూ,మంగ ,స్వప్న నూకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు విశేష్పందన లభిస్తోంది. అధిక సంఖ్యలో ప్రజలు శిబిరాలకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. జీవీఎంసీ 89వ వార్డు యల్లపువానిపాలెం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం 463 సచివాలయం పరిధిలో ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యులు వ్యాధిగ్రస్తులైన వారిని పరిశీలించి తగిన వైద్య సలహాలు ఇవ్వడంతో పాటు మందులు అందించారు. ఏపీడీ శ్రీరామ్ మాట్లాడుతూ 270 మందికి సేవలందిచామన్నారు. 89వ వార్డు వైఎసార్ సీపీ నాయకులు అయితంశెట్టి గోపాల కృష్ణ, నగర కార్యదర్శి ఆళ్ల పైడిరాజు ఏర్పాట్లను పరిశీలించారు. ఏవిధమైన అవసరం ఏర్పడినా తక్షణం ఏర్పాటు చేస్తామని తెలిపారు. డెంటల్, కంటి వైద్యులు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్ వైద్య నిపుణులు పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. క్షయ సిబ్బంది ప్రత్యేక కౌంటర్ ద్వారా వ్యాధిగ్రస్తులకు సేవలు అందించారు. వ్యాధి లక్షణాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ రమణ, సంతోష్, శానిటరీ అధికారులు, సచివాలయ కార్యదర్శులు, వంటీర్లు, ఆశ వర్కర్లు తదితరులు సహాయ సహకారాలు అందించారు.

దేశానికే ఆదర్శం జగనన్న ఆరోగ్య సురక్ష

సింధియా: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల నుంచి పుట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శమని వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు కలిదిండి బద్రీనాథ్ అన్నారు. జీవీఎంసీ 40వ వార్డులోని వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావుతో కలిసి బద్రీనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల జీవనశైలి మార్పులతో దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతున్నాయని, ఇలాంటి తరుణంలో ముందుగానే వ్యాధులను గుర్తించి సరైన వైద్య సహాయం అందిస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని సీఎం వైఎస్ జగన్ ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకువచ్చారని అన్నారు. వైద్య శిబిరానికి హాజరైన ప్రజలకు ఆదారి ఆనంద్‌కుమార్ సహకారంతో భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సోమినాయుడు, డాక్టర్ మహాలక్ష్మినాయుడు, స్పెషల్ ఆఫీసర్ శ్రీరామ్మూర్తి, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు శాంతినగర్‌లో ఆరోగ్య సురక్ష క్యాంప్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్ సచివాలయంలో శనివారం నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించనున్నారు. నేతాజీనగర్ సచివాలయం పరిధిలో ప్రజలకు ఇప్పటికే టోకెన్లు జారీ చేశారు. ఎవరికైనా టోకెన్లు అందకపోయినా నేరుగా వైద్య శిబిరానికి వచ్చి సేవలు పొందవచ్చని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తెలిపారు.

క్లుప్తంగా

సమస్యల పరిష్కారం కోరుతూ సీపీకి వినతులు



సిబ్బందితో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ రవిశంకర్

దొండపర్తి: పోలీస్ సిబ్బంది సమస్యలు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలీసుల సమస్యల పరిష్కారానికి సీపీ శుక్రవారం తన ఛాంబర్‌లో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 13 మంది సిబ్బంది తమ సమస్యలను వినతుల రూపంలో సీపీకి తెలిపారు. ఇందులో ప్రమోషన్లు, క్వార్టర్లు, విభజన సమయంలో అనకాపల్లికి వెళ్లిన ఆరుగురు సిబ్బందిని తిరిగి నగర పరిధిలోకి తీసుకురావాలని కోరుతూ సీపీకి వినతులు అందజేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ అప్పలనాయుడు

గోపాలపట్నం: పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గోపాలపట్నం పోలీసులు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తొలుత గోపాలపట్నం ఎస్‌ఐ అప్పలనాయుడు పోలీస్ వ్యవస్థ పోలీస్ స్టేషన్‌లో జరిగే ప్రక్రియల గురించి విద్యార్థులకు వివరించారు. రోల్ ఆఫ్ టెక్నాలజీ, సోషల్ మీడియా అబ్యూస్, సైబర్ ఫ్రాడ్ అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఉత్సాంగా పాల్గొన్నారు. సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న మోసాలను వివరించి, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం వేణుగోపాల్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్ కోర్సులో ఉచిత శిక్షణ

పెదగంట్యాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా ప్రభుత్వ ఐటీఐలో స్కిల్ హబ్ ద్వారా నిరుద్యోగ యువతకు కంప్యూటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని జిల్లా నైపుణ్యాధికారి సాయికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభకు అనుగుణంగా శిక్షణ ఇచ్చి, వారికి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. 30 సంవత్సరాల లోపు వయసు ఉండి, పదో తరగతి పాసైన వారు అర్హులని తెలియజేశారు. మరిన్ని వివరాలకు 81217 43777 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

రూ.57.06 లక్షల ఆస్తి పన్ను వసూలు



జెడ్సీ సింహాచలంకు ఆస్తి పన్ను చెక్కులను అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

గాజువాక : జీవీఎంసీ గాజువాక జోన్ రెవెన్యూ సిబ్బంది శుక్రవారం రూ.57,06,432 ఆస్తి పన్నును వసూలు చేశారు. 86వ వార్డుకు చెందిన అదిత్రి హౌసింగ్ కార్పొరేషన్ నుంచి రూ.45,13,736, 64వ వార్డుకు చెందిన శ్రావణ్ షిప్పింగ్ నుంచి రూ.11,92,696 పన్నును వసూలు చేశారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కులను జోనల్ రెవెన్యూ అధికారులు సీహెచ్.రామనారాయణ, ఎం.శ్రీకాంత్, ఆర్‌ఐలు సుభాన్, రెడ్డి మోహన్, శివ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలానికి అందజేశారు. ఆయన అధికారులను, సిబ్బందిని అభినందించారు.

విశాఖ వెటరన్ అథ్లెట్ మీట్ రేపు

మురళీనగర్: విశాఖ జిల్లా వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని పోలీస్ బ్యారెక్స్ మైదానంలో ఆదివారం వెటరన్ అథ్లెటిక్స్ మీట్ పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె.బాబూరావు, మంగా వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రన్నింగ్ 100 మీ., 200 మీ., 400 మీ., 800 మీ., 1500 మీ., 5000 మీ., వాకింగ్ 5 కి.మీ, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, షాట్‌పుట్, జావిలిన్ త్రో, డిస్కత్రో, హేమర్ త్రో వంటి క్రీడల్లో పోటీలు జరుగుతాయన్నారు. 30 ఏళ్లు దాటిన వారందరూ పాల్గొనవచ్చని, వయసుల వారీగా విభజించి పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. క్రీడాకారులు వారి పుట్టిన తేదీ సర్టిఫికెట్‌తో రావాల్సి ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో మొదటి రెండు స్థానాలు సాధించిన వారిని నవంబర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. పాల్గొన్న వారికి స్నాక్స్, మధ్యాహ్న భోజనం అందిస్తామని తెలిపారు. వివరాలకు 97013 47311, 98666 68966, 83091 57522, 92474 24395 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

చీటీల పేరుతో టోకరా!

- 30 మంది నుంచి రూ.50 లక్షల వసూలు
- పరారీలో నిర్వాహకురాలు

పెందుర్తి: చీటీల పేరుతో ఓ మహిళ తమను మోసం చేసిందని బాధితులు శుక్రవారం పెందుర్తి పోలీసులను ఆశ్రయించారు. దాదాపు 30 మందికి రూ.50 లక్షలకు పంగనామం పెట్టింది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం..పెందుర్తి అఖిలేశ్వరి ఆస్పత్రి సమీపంలో మెండ పార్వతి అనే మహిళ చాలాకాలంగా చీటీలను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో వివిధ రకాల చీటీల పేరుతో దాదాపు 30 మంది వద్ద రూ.50 లక్షల వరకు వసూలు చేసింది. అయితే పాడుకున్న నగదు తన వద్ద ఉంచితే అధిక వడ్డీ ఇస్తానని నమ్మించి ఆ నగదు తన వద్దే ఉంచుకునేది. అయితే వడ్డీ సక్రమంగా ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చి వారు పార్వతిని నిలదీశారు. దీంతో ఆర్నెల్ల కిందట ఆమె పెందుర్తి నుంచి పరారైంది. ఆమె ఆచూకీ కోసం ఎంత గాలించినా ఫలితం లేకపోవడంతో బాధితులు శుక్రవారం పెందుర్తి పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఆయుధాల ప్రదర్శన



ఆయుధాలను పరిశీలిస్తున్న సీపీ రవిశంకర్, విద్యార్థులు

దొండపర్తి: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు సందర్భంగా శుక్రవారం బ్యారెక్స్ ప్రాంతంలో ఉన్న ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో ఆయుధాల ప్రదర్శన(ఓపెన్ హౌస్) నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ప్రదర్శనను పరిశీలించారు. అనంతరం పోలీస్ వ్యవస్థ పనితీరు, పోలీసులు తమ దైనందిన విధుల్లో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, పరికరాలు, డాగ్ స్క్వాడ్, బాంబ్ డిటెక్షన్ స్క్వాడ్, కమ్యూనికేషన్, ఫింగర్ ప్రింట్స్, క్లూస్ టీంల ప్రదర్శనలను కళాశాలలు, పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే అల్లర్ల సమయంలో గుంపును చెదరగొట్టడంతో, వజ్రా వాహనం ద్వారా బాష్ప వాయువును ప్రయోగించి చూపించారు. ఈ ప్రదర్శన ఏర్పాటుపై పాఠశాలల ఉపాధ్యాయులు సీపీ రవిశంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ.5 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3 వేలు, తృతీయ బహుమతిగా రూ.2 వేలు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ–1 కె.శ్రీనివాసరావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏడీసీపీ, ఏసీపీలు, ఆర్‌ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అఖిల్‌కు రూ.లక్ష ప్రోత్సాహం

విశాఖ స్పోర్ట్స్ : జాతీయ అండర్11 చదరంగం చాంపియన్‌షిప్‌లో 11వ స్థానంలో నిలిచిన విశాఖకు చెందిన అఖిల్ శ్రీప్రసాద్ రూ.లక్ష ప్రోత్సాహకాన్ని అందుకున్నాడు. పోర్ట్ స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో ఏపీ తరఫున పాల్గొన్న చిన్నారుల్లో అఖిల్ తొలిస్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా ఓపెన్, బాలికల విభాగాల్లో ఏపీ తరఫున పాల్గొని ఆధిక్యాన్ని ప్రదర్శించిన ఇద్దరు చిన్నారులకు చెరో లక్ష ప్రభుత్వం తరఫున ఇవ్వనున్నట్లు ఇటీవల జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ప్రకటించారు. దీనిలో అఖిల్‌కు శుక్రవారం పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు చెక్ అందజేశారు.

సార్వత్రిక విద్యపై విస్తృత ప్రచారం

విశాఖ విద్య: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే టెన్త్, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం విస్తృత ప్రచారం చేస్తున్నట్లు డీఈవో చంద్రకళ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. డీఎంహెచ్‌వో, అడల్ట్ ఎడ్యుకేషన్, డ్వామా, కేంద్ర కారాగారం, స్కిల్ డవలెప్‌మెంట్ కేంద్రాల్లో పరీక్షల విభాగం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆధ్వర్యంలోని బృందం ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ తరుపున అసిస్టెంట్ కమిషనర్ మురళీ మోహన్, రాష్ట్ర సమన్వయకర్త సుధాకర్ తదితరులు పాల్గొన్నట్లు డీఈవో చంద్రకళ తెలిపారు.

29న మార్టిన్ లూథర్ కింగ్ చిత్ర సమీక్ష

మద్దిలపాలెం: ప్రజాస్వామ్యంలో ఓటు విలువ చెబుతూ రూపొందించిన మార్టిన్ లూథర్ కింగ్‌పై ఈ నెల 29న సమీక్ష చేస్తున్నట్లు వైజాగ్ ఫిలిం సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. పౌర గ్రంథాలయంలో ఆ రోజు ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ సినిమాకు కేరాఫ్ కంచరపాలెం దర్శకుడు వెంకటేష్ మహా ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరించారని చెప్పారు.

ఏకేసీ కాలనీ-2లో నేడు ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు ఏకేసీ కాలనీ–2లో శనివారం ఉదయం 9 గంటల నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి తెలిపారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉన్నా, ప్రభుత్వమే ఖర్చు భరించి మెరుగైన వైద్య సేవలను అందించడంతోపాటు ఉచితంగా మందులు అందజేస్తుందన్నారు. స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

12 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ. 95 వేలు స్వాధీనం

పెందుర్తి: పెందుర్తి సమీపంలోని పులగాలిపాలెం కుమ్మరి కాలనీలో జరుగుతున్న పేకాట శిబిరంపై శుక్రవారం రాత్రి టాస్క్‌ఫోర్స్, పెందుర్తి పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.95 వేలు నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు.

ప్రైవేటీకరణను విరమించే వరకు ఉద్యమం



988వ రోజు దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం విరమించే వరకు ఉక్కు కార్మికుల ఉద్యమాలు కొనసాగుతాయిని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే దీక్షల్లో 988వ రోజు శుక్రవారం, సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్లాంట్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు ఎన్నో ఏళ్లుగా ఇక్కడ కార్మికులు ఎంతగానో శ్రమించారన్నారు. కానీ కార్మిక శక్తికి విలువ లేకుండా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ అంశాన్ని తీసుకువచ్చిందన్నారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు భంగం కలిగించడమే కాక ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తూ ప్లాంటును నష్టాల ఊబిలోకి నెట్టేందుకు యాజమాన్యం ప్రయత్నం చేయడం దురదృష్టకరమన్నారు.

సరకు రవాణాలో ఆర్టీసీ ముందడుగు



పార్సిల్ సర్వీస్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

డాబాగార్డెన్స్: ఏపీఎస్ ఆర్టీసీ సరకు రవాణాలో మరో ముందడుగు వేసింది. సరకు రవాణాకు సంబంధించి డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవ పోస్టర్‌ను శుక్రవారం కార్గో పార్శిల్ కార్యాలయం వద్ద జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అతి తక్కువ చార్జీలతో డోర్ డెలివరీ చేస్తున్నట్టు తెలిపారు. రూ.కేజీ వరకు రూ.18, కేజీ నుంచి 6 కేజీల వరకు రూ.30, 6 కేజీల నుంచి 10 కేజీల వరకు రూ.36, 10 కేజీల నుంచి 25 కేజీల వరకు రూ.48, 25 కేజీల నుంచి 50 కేజీల వరకు రూ.59లకే పార్సిల్, కొరియర్ డోర్ డెలివరీ సదుపాయం కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవికుమార్, ఆర్టీసీ అధికారులు అప్పలనాయుడు, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 76 మందికి ఉద్యోగాలు



అభ్యర్థులకు సూచనలిస్తున్న అధికారి సుబ్బిరెడ్డి

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిదని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు.

ఎంఎఎస్ మెరైన్ సర్వీస్, ఫ్లిప్‌కార్ట్, వరుణ్ మోటార్స్, ఎల్.వి.ప్రసాద్ ఐ ఆస్పత్రి, ముత్తూట్ ఫైనాన్స్, దక్కన్ ఫైన్ కెమికల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 295 ఉద్యోగాల ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 185 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 76 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. వారికి సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఎంతో కృషి చేస్తోందని ఆయన అన్నారు. నిరుద్యోగులు ఉపాధి అవకాశాల కోసం జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు అయితంశెట్టి గోపి, ఆళ్ల పైడిరాజు



కాకరలోవలో మహిళలకు చీరలు అందిస్తున్న బద్రీనాథ్ తదితరులు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో దసరా సంబరాల్లో భాగంగా శుక్రవారం మహిళలకు వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, నగర కార్యదర్శి ఆళ్ల పైడిరాజు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ సమకూర్చిన చీరలను మహిళలకు అందించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో షేక్ రెహ్మాన్, వలంటీర్లు, ఆర్పీలు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

63వ వార్డులో..

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవలో శుక్రవారం స్థానిక మహిళలకు వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ సహకారంతో పార్టీ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి, వార్డు అధ్యక్షుడు సోమాదుల సురేష్‌ల ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, నాలుగు వార్డుల మండల ఇన్‌చార్జి కలిదిండి బద్రీనాథ్ చేతుల మీదుగా వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదారి ఆనంద్‌కుమార్ వంటి నాయకుడు పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు దొరకడం అదృష్టమన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

‘సామాజిక సాధికార బస్సుయాత్ర’కు ఏర్పాట్లు

- నేడు చిట్టివలస బంతాట మైదానంలో బహిరంగ సభ
- హాజరుకానున్న ప్రజాప్రతినిధులు



చిట్టివలస బంతాట మైదానంలో బహిరంగ సభ కోసం నిర్మిస్తున్న వేదిక



బహిరంగ సభ ప్రదేశాన్ని భీమిలి సీఐ రమేష్‌తో కలిసి పరిశీలిస్తున్న ఏసీపీ శివరామిరెడ్డి

తగరపువలస: వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా శనివారం మధ్యాహ్నం చిట్టివలస బంతాట మైదానంలో బహిరంగ సభ జరగనుంది. ఈ యాత్రలో భాగంగా ఎండాడలోని వైఎసార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రులు, ఇతర మంత్రులు మీడియా సమావేశంలో పాల్గొననున్నారు. అనంతరం యాత్రలో పాల్గొన్న మంత్రుల బృందం చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు బోయిపాలెం కూడలి నుంచి ద్విచక్ర వాహనాల ర్యాలీ ప్రారంభమై తగరపువలస వరకు సాగుతుంది. చివరగా చిట్టివలస బంతాట మైదానంలో మధ్యాహం 3 గంటలకు జరిగే బహిరంగ సభకు జీవీఎంసీ, భీమిలి నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కానున్నారు. బహిరంగ సభకు 30 వేల మంది వరకు హాజరు కానున్నట్టు అంచనా వేశారు. ప్రజల సౌకర్యార్థం 16 వేల కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు.

బస్సు యాత్ర విజయవంతానికి కృషి

వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతానికి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డితో గురు, శుక్రవారాల్లో బహిరంగ సభ ప్రదేశాన్ని పరిశీలించారు. మరోవైపు శుక్రవారం మధురవాడ జోన్ ఏసీపీ ఎం.శివరామిరెడ్డి, భీమిలి సీఐ డి.రమేష్ చిట్టివలస బంతాట మైదానాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భద్రతకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

‘మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్’ జీవీఎంసీ కార్యవర్గం ఎన్నిక

డాబాగార్డెన్స్: ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా పీతల వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. జీవీఎంసీ సమావేశ మందిరంలో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డొప్పలపూడి ఈశ్వర్, ప్రధాన కార్యదర్శులు అప్పలరాజు, రవి, కోశాధికారి నాగేశ్వరరావు జిల్లా అధ్యక్షుడితో పాటు జీవీఎంసీ కార్యవర్గాన్ని ప్రకటించారు. అసోసియేషన్ జీవీఎంసీ అధ్యక్షుడిగా రమణ(ట్యాక్స్ కలెక్టర్), ప్రధాన కార్యదర్శిగా బిర్లంగి శంకరరావు, ఉపాధ్యక్షులుగా గణపతి, ఎల్లంనాయుడు, కృపానందం, కార్యదర్శిగా సయ్యద్ సుభాన్, నిర్వాహక కార్యదర్శిగా కిలాని అప్పారావు, కోశాధికారిగా వై.అప్పారావు ఎన్నికయ్యారు. మున్సిపల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ కృషి చేస్తుందని ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గం తెలిపింది. ఈ మేరకు క్షేత్రస్థాయి పర్యటన చేస్తున్నామని, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వంతో పాటు సీడీఎంఏ దృష్టికి తీసుకెళ్తామన్నారు. జీవీఎంసీ జెమ్స్ అధ్యక్షుడు అప్పలనాయుడు, ఉపాధ్యక్షుడు రాజేష్, కోశాధికారి సన్ని, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరావు, వీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గుమ్మడి నర్సింగరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు అడ్డూరి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవుడికి పంచామృతాభిషేకం నేడు

ఉదయం 10 గంటల వరకే దర్శనం

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి పౌర్ణమి సందర్భంగా శనివారం ఉదయం 6 గంటలకు విశేష పంచామృతాభిషేకం నిర్వహిస్తామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ యథావిధిగా జరుగుతుందన్నారు. సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారని, అనంతరం స్వామికి పంచామృతాభిషేకం చేస్తారని చెప్పారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి జరుగుతాయని పేర్కొన్నారు.

చంద్ర గ్రహణం కారణంగా ఆలయాన్ని 10 గంటలకు మూసివేస్తామని, స్వామి దర్శనాలు ఉదయం 10 గంటలకు నిలిపివేస్తామని వెల్లడించారు. సాయంత్రం నిర్వహించే విశేష హారతి రద్దు చేశామని ఈవో తెలిపారు.